సాక్షి
నల్లగొండ
ఆదివారం । 11 । ఫిబ్రవరి । 2024



హోరాహోరీగా ఖోఖో పోటీలు
భువనగిరిలో శనివారం రెండో రోజు రాష్ట్ర స్థాయి 56వ సీనియర్ ఖోఖో పోటీలు హోరాహోరీగా కొనసాగాయి. - 8లో



అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్
ఉదయం రెక్కీ నిర్వహించి రాత్రి పూట చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగను అరెస్ట్ చేశారు. - 8లో



సీపీఆర్ చేసి.. ప్రాణం కాపాడి
వలిగొండలో శనివారం గుండెపోటుకు గురైన మహిళకు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు.. ఓ ఎస్ఐ. - 8లో

సంక్షేమానికి గ్యారంటీ!

- ఎన్నికల హామీలకు రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాధాన్యం
- వ్యవసాయ, సంక్షేమ రంగాలకు పెద్దపీట
- ఆయా పథకాలతో జిల్లా ప్రజలకు చేకూరనున్న ప్రయోజనం
- నియోజకవర్గానికి 3,500 ఇళ్లతో పేదలకు మేలు
- రూ.2లక్షల రుణమాఫీపై కొరవడిన స్పష్టత
- జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు నిర్దిష్టంగా లేని కేటాయింపులు



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చింది. ముఖ్యంగా ఆరు గ్యారంటీలకు పెద్ద పీట వేసింది. ఈ పథకాలపై జిల్లా ప్రజల్లో ఆశలు చిగురించాయి. అలాగే వ్యవసాయ, ఇతర రంగాలకు కూడా తగిన కేటాయింపులు చేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంక్షేమానికి ప్రాధాన్యం ఇచ్చింది. ముఖ్యంగా ప్రతి నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వడంతో పాటు ఇళ్ల నిర్మాణానికి నిధులను ఇచ్చేందుకు చిత్తశుద్ధితో ఉన్నామని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో ప్రజలకు సొంతింటి కల నెరవేరనుంది.

'గృహ జ్యోతి'తో 4,26,859 మందికి లబ్ధి

గృహ జ్యోతి పథకం కింద జిల్లాలో లక్షల కుటుంబాలకు ప్రయోజనం చేకూరనుంది. 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించేవారు నల్లగొండ జిల్లాలో 4,26,859 మంది ఉన్నారు. బడ్జెట్‌లో ఈ పథకానికి నిధులను కేటాయించడంతో వారందరికి మేలు జరగనుంది.

గ్యాస్ పథకంతో 3,35,425 మందికి..



ఎన్నికల్లో హామీ మేరకు రూ.500కే గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేసేందుకు ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు కేటాయించింది. బీపీఎల్ కింద జిల్లాలో గ్యాస్ వినియోగదారులు 3,35,425 మంది ఉన్నారు. వీరికి ఈ పథకం కింద మేలు జరిగే అవకాశం ఉంది.

మండలానికో పబ్లిక్ స్కూల్



విద్యా రంగానికి బడ్జెట్‌లో రూ.21,389 కోట్ల రూపాయలు కేటాయించింది. దీంతో జిల్లాలోని పాఠశాలల్లోనూ మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవకాశం ఉంది. మండలానికో పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు రూ.500 కోట్లు కే టాయించింది. దీంతో నల్లగొండ జిల్లాలోని 33 మండలాల్లో పబ్లిక్ స్కూళ్లు రానున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్‌లను ఏర్పాటు చేయనున్నారు.

గురుకులాలకు సొంత భవనాలు

ఎస్సీ సంక్షేమం కోసం బడ్జెట్‌లో రూ.21,874 కోట్లు కేటాయించింది. అదే విధంగా బీసీ గురుకులాల భవన నిర్మాణాల కోసం రూ.1546 కోట్లు కేటాయించారు. వాటి ద్వారా ఉమ్మడి జిల్లాలోని 15 బీసీ గురుకులాల భవనాల నిర్మాణానికి మోక్షం లభించనుంది. ఎస్సీ ఎస్టీ గురుకుల భవన నిర్మాణాలకు రూ.1250 కోట్లు కేటాయించారు. వీటి ద్వారా ఉమ్మడి జిల్లాలో అద్దె భవనాల్లో ఉన్న 19 ఎస్టీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు వచ్చే అవకాశం ఉంది. మైనార్టీ సంక్షేమానికి రూ.2262 కోట్లు కేటాయించారు. వీటి ద్వారా ఉమ్మడి జిల్లాలోని 13 మైనార్టీ సంక్షేమ హాస్టళ్లలో మౌలిక వసతుల కల్పనకు అవకాశం ఉంది. అదే విధంగా ఎస్సీ గురుకుల సొసైటీల్లో ఎంబీఏ కళాశాలల ఏర్పాటు, గురుకుల పాఠశాలల్లో సౌర విద్యుత్ సదుపాయాల కోసం రూ.250 కోట్ల రూపాయలు కేటాయించింది. తద్వార కూడా ఉమ్మడి జిల్లాలోని 29 ఎస్సీ గురుకులాల్లో ఎంబీఏ కళాశాలతో పాటు సౌర విద్యుత్ వచ్చే అవకాశాలు ఉన్నాయి.

పరిశ్రమలు, ఐటీకి ప్రాధాన్యం

బడ్జెట్‌లో పరిశ్రమల కోసం రూ.2543 కోట్లు కేటాయించింది. అలాగే ఐటీకి రూ.774 కోట్లు కేటాయించింది. తద్వారా కొత్త పరిశ్రమలు నెలకొల్పడం వల్ల తెలంగాణ ప్రాంతంలోని వస్తువులను ఎగుమతి చేసేందుకు పోర్టుల నిర్మాణం చేపడతామని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాలకు ఐటీని విస్తరిస్తామని, ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌కు ప్రాధాన్యం ఇస్తామని చెప్పడం ద్వారా జిల్లాలోని విద్యార్థులకు మేలు చేకూరనుంది.





భట్టిని కలిసిన వారితో ఎమ్మెల్యేలు వీరేశం, బీర్ల ఐలయ్య, అసెంబ్లీలో ఎమ్మెల్యే బీఎల్ఆర్

మెడికల్ కాలేజీలో మౌలిక వసతులు

బడ్జెట్‌లో వైద్య రంగానికి రూ.11,500 కోట్లు కేటాయించింది. వాటితో కొత్త మెడికల్ కళాశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోనున్నారు. నల్లగొండ, సూర్యాపేట మెడికల్ కళాశాలలకు కూడా నిధుల కేటాయింపు జరగనుంది.

రైతు భరోసాతో మేలు

ప్రస్తుతం జిల్లాలో 3.58 లక్షల మంది రైతులు రైతు బంధు పొందుతున్నారు. ప్రస్తుతం ఎకరాకు ఏటా రూ.10 వేలు వస్తోంది. అది ఇకపై రూ.15 వేల చొప్పున వారందరికి అందనుంది. జిల్లాలోని దాదాపు 87 వేల మంది కౌలు రైతులకు కూడా మేలు చేకూరనుంది. జిల్లాలో 50 వేల మందికి పైగా రైతులు ధరణి వల్ల భూ సమస్యలతో బాధ పడుతున్నారు. ఇందు కోసం నిపుణుల కమిటీ వేసినందున వారి సమస్యలు కూడా తీరనున్నాయి. వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ప్రస్తుతం వ్యవసాయ కూలీలు దాదాపు 3.20 లక్షల మంది ఉన్నట్లు అంచనా.

పంచాయతీరాజ్ రోడ్లకు మహర్దశ

పంచాయతీరాజ్ శాఖకు ప్రభుత్వం రూ.40,040 కోట్లు కేటాయించింది. ఒక గ్రామం నుంచి మరో గ్రామానికి డబుల్ లింక్ రోడ్లు ఏర్పాటు చేసేందుకు నిధులు కేటాయించింది. దీంతో జిల్లాలోని గ్రామీణ ప్రాంత రోడ్లు మెరుగుపడే అవకాశం ఉంది. అయితే గ్రామాల్లో రోడ్లతోపాటు నూతన బ్రిడ్జీల నిర్మాణం, గిరిజన తండాలకు కూడా రోడ్ల నిర్మాణానికి మోక్షం లభించనుంది.

రుణమాఫీపై లేని స్పష్టత

నల్లగొండ జిల్లాలో రూ.70 వేల లోపు రుణాలు తీసుకున్న రైతులు దాదాపు 3.50 లక్షల మందికి అయింది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల వరకు రుణ మాఫీ చేస్తామని ఎన్నికల ముందుకు హామీ ఇచ్చింది. అయితే, బడ్జెట్‌లో దీనికి ప్రత్యేక నిధులను కేటాయించలేదు. దీంతో రుణ మాఫీ విషయంలో స్పష్టత లేకుండా పోయింది.

ప్రాజెక్టులకు దక్కేదెంతో..

రాష్ట్రంలో సాగునీటి రంగానికి రూ.28,028 కోట్లను కేటాయించారు. అయితే ఇందులో జిల్లా ప్రాజెక్టులకు ఎన్ని నిధులు కేటాయిస్తారనేది నిర్దిష్టంగా లేదు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ అయినందున ప్రాజెక్టుల వారిగా నిధులు కేటాయించలేదు. జిల్లాలో ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గంతో పాటు డిండి ఎత్తిపోతల, బ్రాహ్మణవెల్లెంల, ఇతర ప్రాజెక్టులకు దాదాపు రూ. 10 వేల కోట్లు నిధులు అసవరం. అందులో ఇప్పటికిప్పుడు పనులను ప్రారంభించేందుకు రూ.3 వేల కోట్లు అవసరమని అధికారులు అంచనా వేశారు. అందులో ఎంత కేటాయిస్తారనేది తేలాల్సి ఉంది.

"

బడ్జెట్ వాస్తవికంగా ఉంది



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ ఈ బడ్జెట్‌లో అప్పులు ఎక్కువగా కనిపించినప్పటికీ వాస్తవికంగా ఉంది. సంక్షేమ రంగానికి ప్రాధాన్యం ఇచ్చారు. గతంలో విద్యా రంగానికి నామమాత్రపు నిధులే కేటాయించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా బడ్జెట్ రూపకల్పన ఉంది. యూనివర్సిటీలకు మాత్రం గతం మాదిరిగానే కేటాయింపు ఉంది.

– అంజిరెడ్డి, అర్థశాస్త్రం అధ్యాపకుడు, ఎంజీయూ

కరెంటు బిల్లు భారం తగ్గుతుంది



రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రకటించిన బడ్జెట్‌లో గృహ జ్యోతి పథకానికి రూ.2418 కోట్ల కేటాయించడం హర్షణీయం. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందించడం వల్ల పేదరికంలో ఉన్న మాలాంటి వారికి ప్రతి నెలా కరెంటు బిల్లు భారం తగ్గుతుంది. ఇచ్చిన హామీని నిలబెట్టుకునేలా ప్రభుత్వం గృహజ్యోతి పథకం అమలు చేస్తున్నందుకు కృతజ్ఞతలు.

– నర్సింగ్ తేరోజ, రాజుపేట, తిప్పర్తి మండలం

ప్రాజెక్టులకు అరకొర నిధులు



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో నీటిపారుదల ప్రాజెక్టులకు అంతంత మాత్రంగానే నిధులు కేటాయించింది. జిల్లాలో ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గంతో పాటు బ్రాహ్మణవెల్లెంల, డిండి ప్రాజెక్టుల పూర్తికి పెద్దఎత్తున నిధుల అవసరం ఉంది. కానీ రాష్ట్ర వ్యాప్తంగా రూ.28,028 కోట్లే ప్రతిపాదించింది. వ్యవసాయ రంగానికి గతంలో రూ.26 వేల కోట్లు కేటాయిస్తే ఇప్పుడు రూ.19,746 కోట్లకు కుదించారు. ఇది ఆశాజనకమైన బడ్జెట్ కాదు.

– రాంరెడ్డి, రైతు సంఘం నాయకుడు

న్యూస్‌రీల్

రేపు జాబ్‌మేళా

నల్లగొండ: తెలంగాణ ఓవర్‌సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో జపాన్ దేశంలోని హాస్పిటాలిటీ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 12న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని హోటల్ మేనేజిమెంట్ ఇన్‌స్టిట్యూట్‌లో జాబ్‌మేళా, ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎస్.పద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు రూ.లక్ష నుంచి రూ.లక్షన్నర వరకు వేతనం చెల్లిస్తారని పేర్కొన్నారు. అభ్యర్థులు వివరాలకు హెచ్ఆర్ మేనేజర్ సెల్ :8125251408 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఎన్‌జీ కళాశాలలోనూ..

రామగిరి(నల్లగొండ): ఈనెల 12న నల్లగొండలోని ఎన్‌జీ కళాశాలలో టీఎస్‌కేసీ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ (కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ (కెమిస్ట్రీ), ఐటీఐ ఫిట్టర్ కోర్సుల్లో ఉత్తీర్ణులై 27 సంవత్సరాల లోపు వయసు కలిగినవారు ఈ మేళాకు హాజరు కావాలని కోరారు.

పలువురు తహసీల్దార్ల బదిలీ

నల్లగొండ: లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా పలువురు తసీల్దార్లను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. సొంత జిల్లాలో పని చేసేవారిని, ఒకేచోట మూడు సంవత్సరాలుగా పనిచేస్తున్న వారితోపాటు జూన్ లోపు రిటైర్డ్ అయ్యే తహసీల్దార్లకు స్థానచలనం కలిగించింది. ఇందులో భాగంగా దేవరకొండ ఆర్డీఓ ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా పనిచేస్తున్న సంఘమిత్రను సూర్యాపేట జిల్లాకు, పి.రాధను రంగారెడ్డి జిల్లాకు, గట్టుప్పల్ తహసీల్దార్ వి.లావణ్యను వికారాబాద్ డీఏఓగా, శాలిగౌరారం తహసీల్దార్ బి.పల్‌సింగ్‌ను మేడ్చల్ జిల్లా డీఏఓగా, కనగల్‌లో పనిచేస్తున్న జ్యోతిని సూర్యాపేట జిల్లాకు బదిలీ చేశారు. అలాగే, సికింద్రాబాద్ ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా పనిచేసే అన్వర్ హుస్సేన్‌ను, మేడ్చల్ మల్కాజిగిరి ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓగా పనిచేస్తున్న ఎల్.వెంకటేశ్వర్‌రావును నల్లగొండకు బదిలీ చేశారు.

బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

నల్లగొండ: జిల్లాలోని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు జిల్లాలోని ఎస్సీ విద్యార్థినీ, విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద 2024–25 సంవత్సరంలో ఒకటో తరగతిలో డే స్కాలర్, 5వ తరగతి నుంచి రెసిడెన్షియల్ ఇంగ్లిష్ మీడియంలో బోధన అందించేందుకు అర్హత కలిగిన పాఠశాలల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలల ప్రారంభం నాటినుంచి ప్రభుత్వ గుర్తింపు పొంది ఉండాలని పేర్కొన్నారు. 5 సంవత్సరాల నుంచి 7, 10 తరగతుల్లో 90 శాతంపైన ఉత్తీర్ణత సాధించి ఉండాలని, ఇందులో 50 శాతం మొదటి తరగతి ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు. పాఠశాలలో మౌలిక వసతులు కలిగి ఉండటంతోపాటు యాజమాన్యం ఫీజుల వివరాలు తెలియజేయాలని, సిబ్బంది నిబంధల ప్రకారం పనిచేయాలని, సొంత భవనం కలిగి ఉండడంతో ఆట స్థలాలు, హాస్టల్ సౌకర్యాలు, బాలబాలికలకు వేర్వేరుగా పాఠశాలలు ఉన్న వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 17వ తేదీలోగా సమర్పించాలని కోరారు.

ఈ-పాస్ మిషన్‌తోనే ఎరువులు అమ్మాలి



శాలిగౌరారంలో ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఏఓ శ్రవణ్‌కుమార్

శాలిగౌరారం: ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలను ఈ పాస్ మిషన్ ద్వారానే చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి(డీఏఓ) పాల్వాయి శ్రవణ్‌కుమార్ ఫర్టిలైజర్ దుకాణాల యజమానులను ఆదేశించారు. శాలిగౌరారంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం ఆయన తనిఖీ చేశారు. ఎరువులు, పురుగు మందుల నిల్వల రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ఎరువులు, పురుగు మందుల విక్రయాల్లో కచ్చితంగా నిబంధనలు పాటించటంతో పాటు రైతులకు నాణ్యమైనవి అందించాలన్నారు. ఎరువుల కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఓ సౌమ్యశృతి, ఏఈఓలు శ్రవణ్‌కుమార్, నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా జేఎన్‌వీ ప్రవేశ పరీక్ష

నల్లగొండ, పెద్దవూర: పెద్దవూర మండలం చలకుర్తి క్యాంపు జవహర్ నవోదయ విద్యాలయంలో 2024–25 విద్యా సంవత్సరానికి తొమ్మిది, పదకొండో తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగిందని డీఈఓ భిక్షపతి, చలకుర్తి నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ నాగభూషణం తెలిపారు. తొమ్మిదో తరగతి ప్రవేశ పరీక్ష నల్లగొండ జిల్లా కేంద్రంతో పాటు చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించగా మొత్తం 1,267 మంది విద్యార్థులకు 930 మంది హాజరు కాగా, 337 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. నల్లగొండలోని నల్లగొండ పబ్లిక్ స్కూల్ కేంద్రంలో 360 మందికి గాను 255 మంది, సెయింట్ ఆల్ఫోన్సెస్ నల్లగొండ సెంటర్‌లో 360 మందికి 265 మంది, నల్లగొండ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 235 మందికి 187 మంది, చలకుర్తి జవహర్ నవోదయ విద్యాలయంలో 312 మందికి 223 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు తెలిపారు. అలాగే పదకొండో తరగతి ప్రవేశ పరీక్షను సూర్యాపేట జిల్లా కేంద్రంలో తొమ్మిది కేంద్రాల్లో నిర్వహించగా 2,126 మంది విద్యార్థులకు 1,781 మంది హాజరు కాగా, 345 మంది విద్యార్థులు గైర్హాజరు. మొత్తంగా తొమ్మిదో తరగతి పరీక్షకు 73.40 శాతం, పదకొండో తరగతి పరీక్షకు 83.77 శాతం మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు. పరీక్షల నిర్వహణకు నలుగురు చీఫ్ సూపరింటెండెంట్లతోపాటు సెంటర్ లెవెల్ అబ్జర్వర్లను నియమించినట్లు తెలిపారు.



చలకుర్తి జేఎన్‌వీలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ప్రిన్సిపాల్ నాగభూషణం

రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- కలెక్టర్ దాసరి హరిచందన

కట్టంగూర్: ఆధునిక సాంకేతిక పద్ధతులతో వివిధ పంటను సాగు చేస్తూ రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన అన్నారు. కట్టంగూర్ మండలం అయిటిపాముల గ్రామ పంచాయతీ పరిధిలోని గంగదేవిగూడెం సమీపంలో ఉన్న కట్టంగూర్ ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌ను శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా నిమ్మ గ్రేడింగ్, నిమ్మ ఒరుగుల తయారీ యంత్రాలు, ఇతర వ్యవసాయ పనిముట్ల పీల్స్ గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ దళారీ వ్యవస్థతో సంబంధం లేకుండా నేరుగా కంపెనీలకు నిమ్మకాయలు, పండ్లను అమ్మే విధానం బాగుందన్నారు. ఈ ఎఫ్‌పీఓ జిల్లాలోని అన్ని ఎఫ్‌పీఓలకు మోడల్‌గా ఉండాలన్నారు. ఎఫ్‌పీఓ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, డీఏఓ శ్రవణ్‌కుమార్, జిల్లా ఉద్యానవన, పట్టుపరిశ్రమల అధికారి సంగీతలక్ష్మి, డీఆర్‌డీఓ కాళిందిని, నాబార్డు అధికారి వినయ్‌కుమార్, ఎల్‌డీఎం శ్రమిక్, నకిరేకల్ హార్టికల్చర్ అధికారి రావుల విద్యాసాగర్, ఎంపీడీఓ సునిత, ఎంపీఓ అథర్‌ఫర్వేజ్, ఆర్ఐ కుమార్‌రెడ్డి, ఏపీఎం వినోద, ఏఓలు శ్రీనివాస్, గిరిప్రసాద్, జానివియా, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి, ఎఫ్‌పీఓ చైర్మన్ చెవుగోని సైదమ్మ, ఐఆర్‌డీఎస్ చైర్మన్ వాడేపల్లి రమేష్ , డైరెక్టర్లు ఉన్నారు.



నిమ్మ గ్రేడింగ్ మిషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ హరిచందన

బోధన సిబ్బంది పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

భువనగిరి: ఎస్‌సీఈఆర్‌టీ(రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి)లో డిప్యూటేషన్, ఓడీ విధానంలో పని చేసేందుకు అర్హత కలిగిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో మాస్టర్ డిగ్రీ, ఎంఈడీ పూర్తి చేసి, బోధనలో పదేళ్ల అనుభవం ఉన్న వారు అర్హులన్నారు. వయస్సు 58 సంవత్సరాలకు మించి ఉండరాదన్నారు. మనస్తత్వ శాస్త్రం 1, తత్వశాస్త్రం 1, సామాజిక శాస్త్రం 1, గణితం 3, భౌతిక శాస్త్రం 3, జువాలజీ 3, సోషల్ 3, తెలుగు 3, ఇంగ్లీష్ 3, ఉర్దూ 2, హిందీ 1, ఐసీటీ 3, శారీరక విద్యలో ఒకటి చొప్పున ఖాళీ పోస్టులు ఉన్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు స్కూల్ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్‌లో ఆదివారం (నేడు)నుంచి ఈనెల 17వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అరవై ఏళ్ల విధ్వంస పాలనను సరిచేశాం

- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి




బీఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్: అరవై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేశారని, వారు చేసిన విధ్వంసాన్ని సరిచేసి తాము పదేళ్లలో ఎంతో అభివృద్ధి చేసి మొదటి స్థానంలో ఉంచామని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. శనివారం నల్లగొండలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ కోసం కొట్లాడింది నీళ్లు, నిధులు, నియామకాల కోసమేనని, కృష్ణా నీటిలో వాటా తేల్చకుండా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడం అంటే మనం వాటా కోల్పోవడమేనని అన్నారు. అనుభవం లేని సీఎం, మంత్రులు అడ్డగోలుగా మాట్లాడుతున్నారని, సీనియర్లు, అనుభవజ్ఞుల సలహాలు, సూచనలు తీసుకోకుండా కేఆర్ఎంబీ మీద సంతకాలు చేశారని విమర్శించారు. రైతుసభను ఏర్పాటు చేసి, రైతులను జాగృతం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కళ్లు తెరిపిస్తామన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, పార్టీ నాయకులు చెరుకు సుధాకర్, పల్లె రవికుమార్, రవీంద్రసింగ్, మాలె శరణ్యారెడ్డి, కరీం పాషా, చిట్ల వెంకటేశం, తండు సైదులు గౌడ్, నారబోయిన భిక్షం, వంగాల సహదేవరెడ్డి, దోటి శ్రీనివాస్, బకరం వెంకన్న, రవీందర్‌రెడ్డి, యాదయ్య, దేవేందర్ పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి హాఫ్ నాలెడ్జ్ వ్యక్తి

సీఎం రేవంత్‌రెడ్డి హాఫ్ నాలెడ్జ్ వ్యక్తి అని, తప్పులను కప్పిపుచ్చుకునేందుకు కాంగ్రెస్ నాయకులు ఎదురు దాడి చేస్తున్నారని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఈనెల 13న నల్లగొండ పట్టణ సమీపంలోని మర్రిగూడ బైపాస్‌లో మాజీ సీఎం కేసీఆర్ హాజరు కానున్న బహిరంగ సభాస్థలిని శనివారం ఆయన మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, గాదరి కిషోర్‌కుమార్, చిరుమర్తి లింగయ్య, సభ సమన్వయ కర్త రవీందర్‌సింగ్‌లతో కలిసి పరిశీలించారు. అనంతరం జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ గుర్తులను చెరిపేస్తామని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు రైతుబంధు, రైతు రుణమాఫీ, 24 గంటల కరెంట్ లాంటి వాటిని మాయం చేసే ప్రయత్నంలో ఉన్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు నీచ సంస్కృతికి పాల్పడకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. నేడు దొంగల చేతిలోకి తెలంగాణ పోయిందని, కృష్ణా ప్రాజెక్టులను తిరిగి రాష్ట్ర పరిధిలోకి రాకపోతే కాంగ్రెసోళ్లను ప్రజలు గ్రామాల్లో తిరగనివ్వరన్నారు.

ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ తూములకు పోలీస్ రక్షణ



ధ్వంసమైన డి-22 గేటు స్క్రూరాడ్, గేర్‌బాక్స్ (ఫైల్)

గుర్రంపోడు: ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ తూముల వద్ద పోలీస్ రక్షణ కల్పిస్తున్నారు. రాత్రివేళల్లో కొందరు రైతులు బలవంతంగా గేట్లను ఎత్తుతుండటంతో తూములు ధ్వంసమవుతున్నాయి. ఇటీవల డి–22 గేటును రాత్రివేళ కొందరు ఎత్తుతుండగా అడ్డుకోబోయిన లస్కర్లపై రాళ్ల దాడి చేయడంతో వారు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో తూముల వద్ద రాత్రివేళ పోలీస్ సిబ్బందిని కాపలాగా పెట్టి రక్షణ కల్పించాలని కోరుతూ నీటిపారుదల శాఖ ఏఎమ్మార్పీ పరిధిలోని డివిజన్ల ఈఈలు శనివారం జిల్లా పోలీస్ ఉన్నతాధికారికి వినతిపత్రం సమర్పించారు. దీంతో ఏఎమ్మార్పీ ప్రధాన కాల్వ పరిధిలోని తూముల వెంట పగలు, రాత్రి పెట్రోలింగ్ నిర్వహించాలని పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు అందాయి. గుర్రంపోడు డివిజన్ పరిధిలోని డి–16 నుంచి డి–25 వరకు గల తూముల రక్షణకు తమకు ఆదేశాలు అందాయని ఎస్ఐ బి.శివప్రసాద్ తెలిపారు. రాత్రి వేళ పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తామని, తూముల వద్ద సంచరించే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్

నల్లగొండ: పదో తరగతి వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ అన్నారు. శనివారం నల్లగొండలోని సెయింట్ ఆల్ఫోన్సెస్ ఉన్నత పాఠశాలలో డీఈఓ బొల్లారం భిక్షపతి అధ్యక్షతన ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, కేజీబీవీల ప్రత్యేక అధికారులు, ఆదర్శ పాఠశాలల ప్రిన్సిపాళ్లతో జరిగిన సమీక్ష సమావేశానికి అదనపు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మార్చిలో నిర్వహించనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాలన్నారు. ఇ గ్రేడ్ విద్యార్థులను ఉపాధ్యాయులు దత్తత తీసుకొని ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేటట్లు చూడాలన్నారు. డీఈఓ భిక్షపతి మాట్లాడుతూ గతేడాది 50 శాతంలోపు ఉత్తీర్ణత సాధించిన 19 పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ప్రత్యేకంగా సమీక్షించి వంద శాతం ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థులు ఇంటి వద్ద రివిజన్ చేయడంపై తల్లిదండ్రులకు సూచనలు చేయాలన్నారు. మండల నోడల్ అధికారులు ప్రతిరోజూ కస్తూరిబా పాఠశాలలను సందర్శించి లోపాలను గుర్తించి వాటిని అధిగమించేలా సూచనలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు, డీసీఈబీ సెక్రటరీ, ఎఫ్ఏఓ, ఎంఈఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం


జానకిరాం (ఫైల్)

భువనగిరి క్రైం : రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. జనగాం జిల్లా నర్మెట్ట మండలం గండిరామవరం ఆవాసం మనుబూతుల తండాకు చెందిన భుక్య జానకిరాం(27) హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. ఇటీవల స్వగ్రామానికి వచ్చిన జానకిరాం విధులకు హాజరయ్యేందుకు శనివారం బైక్‌పై హైదరాబాద్‌కు బయలుదేరాడు. మార్గమధ్యలో భువనగిరి పట్టణంలోని బైపాస్ రోడ్డులో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి కొడుకు, కూతురు, భార్య ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగరాజు తెలిపారు. మృతుడి వద్ద లభ్యమైన రూ.లక్ష నగదు, ఐఫోన్‌ను 108 సిబ్బంది పోలీసులకు అప్పగించారు.

పోలీసుల అదుపులో ముగ్గురు దొంగలు

చౌటుప్పల్ : చౌటుప్పల్ మండలంలో శుక్రవారం సంచలనంగా మారిన పిల్లల అపహరణ ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గ్రామాల్లో సంచరించినది మేకలు ఎత్తుకెళ్లేందుకా లేక పందులను దొంగతనం చేసేందుకా అని పట్టుబడ్డ వ్యక్తులను ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. పందులను దొంగనం చేసేందుకే వారు సంచరించినట్టుగా పోలీసులు విచారణలో గుర్తించినట్టు సమాచారం. పిల్లలను అపహరించే ముఠా సంచరిస్తున్నారనే ప్రచారం మండల వ్యాప్తంగా హల్‌చల్ చేసిన నేపథ్యంలో వాహనంలోని సభ్యులు పందుల దొంగలుగా తేలడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

పందుల దొంగతనంపై మహిళ ఫిర్యాదు

గత నెల 22న తమ పందులు చోరీకి గురయ్యాయని చౌటుప్పల్ మండల పరిధిలోని జైకేసారం గ్రామానికి చెందిన ఒంటెద్దు కృష్ణవేణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వాహనంలో వచ్చి 10వేల విలువైన పెద్ద పందితోపాటు మరో నాలుగు చిన్న పందులను అపహరించారని తెలిపింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం గ్రామానికి చెందిన వ్యక్తులు హనుమంతు రవి, హనుమంతు మధు, హనుమంతు రాజులపై ఆమె అనుమానం వ్యక్తం చేస్తూ ఫిర్యాదు ఇచ్చింది. ఆమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు. పందుల దొంగతనం విషయంలో వాడిన వాహనం, శుక్రవారం మరోసారి జైకేసారంలో సంచరించినది, పట్టణ కేంద్రంలో స్థానికులు వెంబడించినది ఒకే వాహనం కావడంతో పోలీసులు అదుపులో ఉన్న వ్యక్తులు పందులను ఎత్తుకెళ్లే సభ్యులుగానే తెలుస్తోంది. కేసు దర్యాప్తు చేస్తున్నామని సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

అంతర్ రాష్ట్ర దొంగ అరెస్ట్

- రూ. 17.50 లక్షల విలువైన సొత్తు స్వాధీనం
- రెండు బైక్‌లు సీజ్
- పరారీలో మరో ముగ్గురు నిందితులు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ రాహుల్ హెగ్డే

సూర్యాపేట క్రైం : ఉదయం రెక్కీ నిర్వహించి రాత్రి పూట చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర దొంగను పోలీసులు అరెస్ట్ చేశారు. అతడి వద్ద రూ.17.50లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్ హెగ్డే కేసు వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు సీఐ రాజశేఖర్ సిబ్బందితో సూర్యాపేట పట్టణంలోని లాడ్జిల్లో తనిఖీలు చేపట్టగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని బల్లేపల్లి పాండురంగాపురం గ్రామానికి చెందిన సంపటి ఉమాప్రసాద్ పట్టుబడ్డాడని తెలిపారు. అతడిని. పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టగా చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నాడు. ఉమా ప్రసాద్ చిన్న వయసులో చదువుకు స్వస్తి పలికి చిన్నచిన్న దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. సూర్యాపేట పట్టణంలో రెండు సంవత్సరాల్లో నిందితుడు 6 దొంగతనాలకు పాల్పడ్డాడన్నాని తెలిపారు. ఇతనికి మరో ముగ్గురు నిందితులు ఖమ్మం జిల్లా కేంద్రంలోని బల్లేపల్లిపాండురంగాపురంకు చెందిన తెల్లనాగు మురుగేశ్, మహ్మద్‌అంజద్‌పాషా, హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరికి చెందిన రోషన్‌కుమార్ సింగ్‌లు సహకరించారని. వీరు పరారీలో ఉన్నారని తెలిపారు. నిందితుడు సంపటి ఉమా ప్రసాద్‌కి 2017 సంవత్సరం వరకు నేర చరిత్ర ఉందన్నారు. జైలు నుంచి బయటకు వచ్చి కూడా పాత వృత్తినే కొనసాగిస్తూ కేరళలో కూడా చోరీలకు పాల్పడ్డాడని తెలిపారు. అక్కడి పోలీసులకు పట్టుబడ్డాడని తెలిపారు. నిందితుడిపై ఖమ్మం జిల్లా, కేరళ రాష్ట్రంలో మొత్తం 12 కేసులు ఉన్నాయన్నారు.

జైలు నుంచి విడుదలై..

కేరళ జైలు నుంచి కొన్ని నెలల క్రితం విడుదలైన ఉమా ప్రసాద్ సూర్యాపేట పట్టణంలోని లాడ్జ్‌లో ఉంటూ చోరీలకు పాల్పడుతున్నాడని తెలిపారు. దొంగిలించిన సొత్తులో కొంత దాచుకొని, మిగితా సొమ్ము తన స్నేహితులైన మురుగేశ్, అంజద్ , రోషన్‌లతో కలిసి పంచుకొని, కొంత కుదువపెట్టి ఆ డబ్బులతో ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారని తెలిపారు. ఉమా ప్రసాద్‌ను విచారించగా గత డిసెంబర్ 13నుంచి సూర్యాపేటలో ఉంటూ కృష్ణా కాలనీ, విద్యానగర్, అంజనాపురి కాలనీ, భగత్ సింగ్ నగర్ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నాడని తెలిపారు. నిందితుడి వద్ద 8 తులాల బంగారు, డైమండ్ ఆభరణాలు, 5700 విదేశీ నోట్లు, ఒక యమహా స్కూటీ, ప్యాషన్ ప్రో బైక్, దొంగతనానికి వాడిన కట్టర్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు. దొంగిలించిన మొత్తం సొత్తు విలువ రూ.17,50,000 ఉంటుందని తెలిపారు. నిందితుడు ఉమాప్రసాద్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. కేసులను ఛేదించడంలో చాకచక్యత ప్రదర్శించిన సూర్యాపేట సీఐ రాజశేఖర్, ఎస్ఐలు యస్.కె. యాకూబ్, ప్రవీణ్‌కుమార్, కుశలవ, సైదులు, క్రైమ్ సిబ్బంది గోదేషి కరుణాకర్, గొర్ల కష్ణ, సైదులు, ఆనంద్, శివ కష్ణ , మధు, సుధాకర్‌ను ఎస్పీ అభినందించారు.

అనుమానాస్పద స్థితిలో ఇంటర్ విద్యార్థిని మృతి

- ఇమాంపేట బాలికల గురుకుల పాఠశాలలో ఘటన
- ఉమ్మడి జిల్లాలో వరుస ఘటనలతో కలకలం
- ఇటీవల యాదాద్రి జిల్లాలో ఇద్దరు బాలికలు ఆత్మహత్య

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట మండలంలోని ఇమాంపేటలోని సాంఘిక సంక్షేమ ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం రాత్రి ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. సూర్యాపేట పట్టణానికి చెందిన వెంకన్న, భాగ్యమ్మల కుమార్తె దగ్గుపాటి వైష్ణవి (17) గురుకుల పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. గురుకుల పాఠశాలలో శనివారం ఫేర్‌వెల్ డే ఉండగా విద్యార్థిని తండ్రి ఉదయం 9గంటలకు వచ్చి పూలు , గాజులు ఇచ్చి వెళ్లాడు. సాయంత్రం పాఠశాల ఆవరణలో జరిగిన ఫేర్‌వెల్ డేలో వైష్ణవి పాల్గొన్నది. అయితే ఈ కార్యక్రమం జరుగుతుండగానే వైష్ణవి హాస్టల్ గదికి వెళ్లిపోయింది. గంట తర్వాత తోటి విద్యార్థులు వెళ్లి చూడగా వైష్ణవి అపస్మారకస్థితిలో ఉంది. ఈ విషయాన్ని వారు వెంటనే ప్రిన్సిపల్‌తో పాటు సిబ్బందికి చెప్పడంతో వైష్ణవిని సూర్యాపేట జనరల్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. హాస్టల్ సిబ్బంది ఈ విషయాన్ని విద్యార్థిని తల్లిదండ్రులకు కూడా తెలియజేయడంతో వారు


శనివారం సాయంత్రం తన తల్లితో వీడియో కాల్‌లో మాట్లాడిన వైష్ణవి

ఏరియా ఆస్పత్రికి వచ్చారు. తమ కూతురును విగతజీవిగా చూసి బోరున విలపించారు. శనివారం సాయంత్రం పాఠశాలలో జరిగిన ఫేర్‌వెల్ డేకు వెళ్లేందుకు తయారైన తర్వాత వీడియో కాల్ చేసి తమతో నవ్వుతూ మాట్లాడిందని విద్యార్థిని తల్లిదండ్రులు వెంకన్న, భాగ్యమ్మ రోదిస్తూ తెలిపారు. తమ కూతురు కొన్ని రోజుల క్రితం ఇంటికి వచ్చిన సమయంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కలిసి ఎలా చదువుతున్నావని పలకరించిందని చెప్పారు. అప్పుడు


సూర్యాపేట ఆస్పత్రివద్ద వైష్ణవి తల్లిదండ్రులు

తమ కూతురు.. హాస్టల్‌లో అన్నం బాగుండడం లేదని, రాళ్లు వస్తున్నాయని చెప్పగా అక్కడి నుంచే మున్సిపల్ చైర్‌పర్సన్ ఫోన్‌లో ప్రిన్సిపల్‌తో మాట్లాడారని చెప్పారు. ఈ విషయం మనసులో పెట్టుకుని తమ కూతురును వేధించారని, దీంతోనే మనస్తాపంతో మృతిచెందిందని, తమ కూతురును హత్యచేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని వారు ఆరోపించారు. వైష్ణవి మృతదేహంపై గాయాలు ఉండడంతో తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయమై కళాశాల ప్రిన్సిపల్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. సూర్యాపేట రూరల్ పోలీసులు ఆస్పత్రికి వచ్చి వివరాలు సేకరించారు. సూర్యాపేట డీఎస్పీ నాగభూషణం హాస్టల్‌కు వెళ్లి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కాగా, వారం రోజుల క్రితం భువనగిరిలోని ఎస్సీ హాస్టల్‌లో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న ఘటన మరుకముందే సూర్యాపేటలో మరో బాలిక అనుమానాస్పదస్థితిలో మృతిచెందడం కలకలం రేపింది.

బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతం

భువనగిరి క్రైం : బాలుడి కిడ్నాప్ కథ సుఖాంతమైంది. సీసీ కెమెరాల ఆధారంగా నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు బాలుడిని క్షేమంగా శనివారం తల్లిదండ్రులకు అప్పగించారు. నిజామాబాద్ జిల్లాలోని రాతాల రాంరెడ్డి గ్రామానికి చెందిన బైండ్ల చిన్నరాజు, తన భార్య రాధమ్మ కుమారుడు సిద్దిరాముడు, సోదరి రాజేశ్వరితో కలిసి జీవనోపాధి నిమిత్తం ఈ నెల 4న భువనగిరి పట్టణానికి వచ్చారు. రాత్రి కావడంతో బస్టాండ్ ఎదురుగా ఉన్న బట్టల దుకాణం ముందు పడుకున్నారు.అయితే, బీబీనగర్ మండలంలోని గూడ్రాలదండి గ్రామానికి చెందిన బానోతు మోహన్‌కు ఇద్దరు ఆడపిల్లలు సంతానం. భార్యకు గర్భసంచి తీసివేశారు. అతనికి మగ పిల్లవాడు సంతానం కావాలని తెలిసిన వారు ఎవరైనా ఉంటే చెప్పమని డబ్బులు ఇస్తామని చెప్పేవాడు. రాయగిరి స్టేషన్‌కు చెందిన దూరపు బంధువైన పాల్త్య విజయ, ఓరుగంటి శమంతలు భువనగిరి పట్టణంలోని ఓ గ్లాస్ కంపెనీలో పనిచేస్తున్నారు. మోహన్ కోరిక మేరకు పాల్త్య విజయ సదరు బాలుడిని అపహరించి మోహన్‌కు అప్పగించారు. బాధితుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా ముగ్గురు నిందితులను గుర్తించి అరెస్ట్ చేశారు.కిడ్నాప్‌కు నిందితుడు ఉపయోగించిన బైక్‌ను స్వాధీనం చేసుకుని, బాలుడిని వారి వద్ద నుంచి తీసుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. కేసును ఛేదించిన సీఐ సురేష్‌కుమార్, ఎస్ఐ నాగరాజు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు అభినందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి క్షేత్రంలో శ్రీరాజ్యలక్ష్మి, చెంచులక్ష్మి సమేత శ్రీ లక్ష్మీనరసింహ స్వామి నిత్య శాశ్వత కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో శనివారం ఉదయం సుప్రభాత సేవ, నిత్యాగ్నిహోత్రి, స్వామివారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర సహస్ర నామార్చన, అమ్మవార్లకు సహస్ర కుంమార్చనలుపూజలు జరిపించారు. మధుపర్క పూజ మాంగళ్యధారణ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధర్మకర్త చెన్నూరు మట్టపల్లి రావు, విజయ్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

సీపీఆర్ చేసి.. ప్రాణాలు కాపాడి

- గుండెపోటుకు గురైన మహిళకు ఎస్ఐ తక్షణ సాయం
- ఆస్పత్రికి తరలించగా కోలుకున్న బాధితురాలు
- వలిగొండ ఎస్ఐ మహేందర్ లాల్‌కు అభినందనల వెల్లువ


గుండెపోటుకు గురైన మహిళకు సీపీఆర్ చేస్తున్న ఎస్ఐ

వలిగొండ : గుండెపోటుకు గురైన మహిళకు సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడాడు.. ఓ ఎస్ఐ. యాదాద్రి భువనగిరి జిల్లాలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. భువనగిరి మండలం మన్నెవారిపంపు గ్రామానికి చెందిన బోయిన వెంకటమ్మ శుక్రవారం బంధువులతో కలిసి నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు గ్రామంలో శ్రీ పార్వతీరామలింగేశ్వర స్వామి ఆలయానికి వెళ్లారు. దైవ దర్శనం అనంతరం శనివారం స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యలో వలిగొండ మండల కేంద్రంలో బస్టాండ్‌లో భువనగిరి వైపు వెళ్లే బస్సు కోసం ఎదురు చూస్తున్నారు. ఈ క్రమంలో వెంకటమ్మ గుండెపోటుకు గురై కుప్పకూలి అపస్మారకస్థితిలోకి వెళ్లింది. అదే సమయంలో అక్కడికి వచ్చిన వలిగొండ ఎస్ఐ మహేందర్‌లాల్ వెంటనే ఆమెకు సీపీఆర్ చేయడంతో స్పృహలోకి వచ్చింది. వెంటనే ఆ మహిళను భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించగా కోలుకున్నారు. సకాలంలో స్పందించి సీపీఆర్ చేసి మహిళ ప్రాణాలను కాపాడిన ఎస్ఐ మహేందర్ లాల్ను భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

విష ప్రయోగం ఘటనలో మరొకరి మృతి

డిండి: విషం కలిపిన సారా తాగిన ఘటనలో మరొకరు మృతిచెందారు. డిండి మండల పరిధి లోని వీరబోయనపల్లికి చెందిన సహదేవుడును చంపాలని అదే గ్రామానికి చెందిన నంది ఈశ్వరయ్య, నాగర్‌కర్నూల్ జిల్లా వెలుమలపల్లి గ్రామానికి చెందిన చెనమోని జంగయ్య పన్నాగం పన్నారు. విషం కలిపిన సారా తాగడంతో ఈ నెల 6న సహదేవుడు మృతి చెందగా అస్వస్థతకు గురైన రాము(17) హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. దేవరకొండ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన తర్వాత మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పజెప్పారు. ఈ కేసులో నిందితులను ఇప్పటికే రిమాండ్ చేశారు.

‘గ్యారంటీ’ బడ్జెట్‌పై హర్షం

రుణమాఫీ ప్రస్తావన లేకపోవడం, సాగునీటికి అరకొర కేటాయింపులపై అసంతృప్తి

రాష్ట్ర అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క శనివారం ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై ఆయా వర్గాల నుంచి మిశ్రమ స్పందన లభిస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారెంటీకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంపై హర్షం వ్యక్తం అవుతోంది. కానీ రైతు రుణమాఫీ ఊసు లేకపోవడం, ప్రాజెక్టులకు అరకొరగా నిధుల కేటాయింపుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. – సాక్షి నెట్‌వర్క్

గ్యారంటీల అమలు దిశగా బడ్జెట్



కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ఆరు గ్యారంటీలను అమలు చేసి ప్రజల మన్ననలు పొందే దిశగా ఈ బడ్జెట్ ఉంది. గత బడ్జెట్‌తో పోలిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో సంక్షేమ రంగానికి పెద్ద పీట వేసింది. ప్రజా శ్రేయస్సే ప్రధాన ధ్యేయంగా బడ్జెట్ ఉంది. వాస్తవిక బడ్జెట్‌ను ప్రజల ముందు ఉంచింది. విద్యా రంగానికి ఈసారి ప్రాధాన్యం ఇచ్చారు.

– పాందరయ్య, అర్థశాస్త్రం అధ్యాపకుడు, ఎంజీయూ

ఎన్నికల హామీలు నెరవేర్చేలా ఉంది



ఆర్థికశాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆరు గ్యారంటీ పథకాలకు రూ.53,196 కోట్ల అంచనా వ్యయాన్ని చూపిచడం ఎన్నికల హామీలు నెరవేర్చాలా కనిపిస్తోంది. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు కేటాయింపులు పెరిగాయి. మూసీనది ప్రక్షాళనకు రూ.వెయ్యి కోట్లు కేటాయించడం శుభపరిణామం. రానున్న రోజుల్లో కేటాయింపులకు చేసే వ్యయంపైనే బడ్జెట్ తీరుతెన్ను ఆధారపడి ఉంటుంది. – డాక్టర్ అక్కెనపల్లి మీనయ్య, అర్థశాస్త్ర రిటైర్డ్ అధ్యాపకుడు

సంక్షేమానికి ఖర్చు చేయాలి



గత ప్రభుత్వం మాదిరిగా కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన ఓటాన్‌అకౌంట్ బడ్జెట్ వెనుకబడిన ప్రాంతాలను విస్మరించినట్లు ఉంది. ఆరు గ్యారంటీలపై ఉన్న చిత్తశుద్ధి మిగిలిన సమస్యలపై లేదు. రుణమాఫీ, రైతుబంధు, రైతు భరోసా ఏవిధంగా అమలు చేస్తారో బడ్జెట్‌లో పేర్కొనలేదు. శ్రీశైలం సొరంగమార్గం పూర్తికి అధిక నిధులు కేటాయించి పూర్తి చేయాలి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్‌లకు నిధులు కేటాయించాలి.

– ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, సీపీఎం జిల్లా కార్యదర్శి

రాష్ట్ర బడ్జెట్ ఆశాజనకం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓటాన్‌అకౌంట్ బడ్జెట్ ఆశాజనకంగా ఉంది. ప్రభుత్వం ఇచ్చిన హామీలపై బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. సాగునీటి ప్రాజెక్టులకు రూ.28 వేల కోట్లు కేటాయించడం హర్షనీయం. ఎస్ఎల్‌బీసీ సొరంగం, డిండి ఎత్తిపోతల పథకం, బ్రాహ్మణవెల్లంల – ఉదయసముద్రం ప్రాజెక్టులు సత్వరమే పూర్తి చేస్తే జిల్లా సస్యశ్యామలం అవుతుంది. ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు బడ్జెట్‌లో కనబడుతోంది.

– నెల్లికంటి సత్యం, సీపీఐ జిల్లా కార్యదర్శి

రూ.500కే సిలిండర్‌తో మేలు



ప్రభుత్వం 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ ఇస్తామనడం వల్ల ఎంతో మేలు కలుగుతుంది. ఇప్పుడు సిలిండర్ ధర వెయ్యి రూపాయలు ఉంది. సబ్సిడీ కూడా వస్తలేదు. సిలిండర్ కొనే విషయంలో చాలా మంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం మహిళలను దృష్టిలో ఉంచుకుని రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామనడం సంతోషం.

– పరమేశ్వరి, గృహిణి, నల్లగొండ

బడ్జెట్‌లో అన్ని రంగాలకు ప్రాధాన్యం



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ చాలా బాగుంది. అన్ని రంగాలకు, వర్గాలకు బడ్జెట్ ఆమోదయోగ్యంగా ఉంది. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించేందుకు ప్రతిపాదించడం హర్షనీయం. అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా తీసుకుపోయేలా బడ్జెట్ ఉంది.

– శంకర్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు, నల్లగొండ

బడ్జెట్ కాంగ్రెస్ అంకెల గారడి



ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు, బడ్జెట్‌కు పొంతన లేదు. పద్దులన్నీ అంకెల గారడీ మాదిరిగానే ఉన్నాయి. రైతు రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. రుణమాఫీ కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించకుండా ప్రభుత్వం రైతాంగాన్ని వంచించింది. బడ్జెట్‌తో ప్రజలకు ఒనగూరే ప్రయోజనం ఏమీ లేదు. – డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం



ప్రభుత్వం మహాలక్ష్మి పథకంలో భాగంగా గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇస్తామని ప్రకటించింది. కూలి నాలి చేసుకునే పేదలకు ఈ పథకం ఎంతో మేలు చేస్తుంది. కిరాయి ఇళ్లలో ఉండే వారికి కూడా ఈ పథకం వర్తింపజేస్తున్నందుకు ప్రభుత్వానికి రుణపడి ఉంటాం.

– మణిమాల, గృహిణి, నల్లగొండ

హామీలపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



అలవికానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వానికి వాటి అమలులో ఏమాత్రం చిత్తశుద్ధి లేదు. విద్య, వైద్యం, వ్యవసాయం, రైతు రుణమాఫీ కోసం బడ్జెట్‌లో అరకొరగా కేటాయింపులు చేశారు. బాలికలకు ఎలక్ట్రికల్ స్కూటీలు ఇస్తామని చెప్పి వాటి ఊసేలేదు. ఆరు గ్యారంటీలతో పాటు ఇతర 420 హామీల కోసం బడ్జెట్‌లో పక్కాగా ఎలాంటి కెటాయింపులు జరుపలేదు. ఇది పూర్తిగా ప్రజలను మోసం చేసే బడ్జెట్ మాదిరిగానే ఉంది.

– రమావత్ రవీంద్రకుమార్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు

ఇది తిరోగమన బడ్జెట్

- మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

సూర్యాపేట : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ రాష్ట్రాన్ని పూర్తిగా తిరోగమన దిశలోకి నెడుతోందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి విమర్శించారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. ఇచ్చిన హామీలను నెరవేర్చాలనే చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదన్నారు. ఇటువంటి మోసపూరిత బడ్జెట్‌ను దేశ చరిత్రలో ఏరాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రవేశపెట్టలేదని విరుచుకుపడ్డారు. రూ.2 లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తామన్న ప్రభుత్వం బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే తీసుకురాలేదన్నారు. మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్న బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదన్నారు. ఆలీబాబా 40 దొంగల్లా.. సీఎం రేవంత్ బ్యాచ్ తెలంగాణ ప్రజలను మోసం చేస్తోందని మండిపడ్డారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కృష్ణా జలాలపై హక్కును కాపాడుకోవాలన్న సోయి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదన్నారు. కాంగ్రెస్ దొంగతనాలను బయటపెట్టాలనే నల్లగొండలో సభకు శ్రీకారం చుట్టామన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వైవీ ఉన్నారు.

హోరాహోరీగా కొనసాగుతున్న ఖోఖో పోటీలు


తలపడుతున్న నల్లగొండ-నిజామాబాద్ జట్ల క్రీడాకారులు

భువనగిరి : భువనగిరిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జరుగుతున్న 56వ సీనియర్ రాష్ట్ర స్థాయి ఖోఖో చాంపియన్‌షిప్-2023-24 పోటీలు రెండో రోజైన శనివారం హోరాహోరీగా కొనసాగాయి. ఉదయం 10 గంటల నుంచి రాత్రి పొద్దుపోయే వరకు14 లీగ్ మ్యాచ్‌లను నిర్వహించారు. ఇందులో ఎనిమిది మహిళలు, ఆరు పురుషులకు సంబంధించిన పోటీలు ఉన్నాయి. ఆదివారం చివరి రోజు నాకౌట్ పద్ధతిలో మ్యాచ్‌లు జరగనున్నాయి. సాయంత్రం ఫైనల్ మ్యాచ్ అనంతరం విజేతలకు బహుమతులు అందజేయనున్నారు. రెండో రోజు జరిగిన పోటీల్లో ఎస్‌ఈ శ్రీనాథ్, డీఈ మల్లికార్జున్, ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి పాల్గొన్నారు

రెండో రోజు ఈ జట్ల మధ్యనే..

మహిళల లీగ్ పోటీలో రెండో రోజు మహబూబ్‌నగర్ ఖమ్మంపై 10-08, రంగారెడ్డి అదిలాబాద్ జిల్లా జట్టుపై 08-05,హైదరాబాద్ మెదక్‌పై 13-06, నల్లగొండ నిజామాబాద్‌పై 09-03, మహబూబ్‌నగర్ వరంగల్‌పై 09-01, రంగారెడ్డి కరీంనగర్ పూ 13-02, ఖమ్మం నిజామాబాద్‌పై 12-11,ఆదిలాబాద్ మెదక్‌పై 06-05, పురుషుల లీగ్ పోటీల్లో కరీంనగర్ మెదక్ పై 15-11, వరంగల్ నల్లగొండ పై 11-10, ఆదిలాబాద్ నిజామాబాద్‌పై 15-08, ఖమ్మం మహబూబ్‌నగర్ పై 12-08, వరంగల్ హైదరాబాద్ పై 14-12, కరీంనగర్ రంగారెడ్డి జిల్లా జట్టు పై 15-14 పాయింట్ల తేడాతో గెలుపొందాయి.



తలపడుతున్న ఆదిలాబాద్-నిజామాబాద్ జట్ల క్రీడాకారులు, మెదక్-రంగారెడ్డి జట్లు


తలపడుతున్న మెదక్, రంగారెడ్డి జట్ల క్రీడాకారులు